కథా నిలయం
5504
శ్రీకాకుళం

# చిరంజీవి ఆశ

ఎండ కరకర లాడుతోంది.

బిల బిల మంటూ వెంకటప్పయ్య గారి కళ్ళంలోకి చేరారు చాలా మంది పిల్లలు.

కొంతమంది డొంక ప్రక్కన చింతచెట్లమీద తమ ప్రతాపం చూపుతున్నారు.

కొందరు ఎదురుగా ఉన్న పడమటి చెరువులో ఈత పోటీల్లో నిమగ్నమై యున్నారు.

ఈత వరకూ ఎదగని సన్నవాళ్ళది వేరే జట్టు. వాళ్లంతా చెరువుకు దక్షిణం చివరన ఉన్న తామరమడుగులో పూలు కోయటం, ఆకులు తుంచటం, కాడలు పెరకటం చేస్తున్నారు.

వెంకటప్పయ్యగారి చేనుని ఆనుకొనే కరణం గారి చేను, కరణం గారి పాలేరు రామయ్య. వాళ్ళ చేలో మెరక సర్దుతున్నాడు.

కళ్ళంలో పిల్లలకి సూరి నాయకుడు. సూరి మునుసబుగారి అబ్బాయి. వాళ్ళఇంట్లో వాడు పాడింది పాట, వాళ్ళ ఊళ్లో వాడు ఆడింది ఆట వాడి జతకత్తె లక్ష్మి. లక్ష్మి సూరి అత్తకూతురు. వీళ్ళిద్దరినీ అంటి పెట్టుకొని ఉండేది చాలా మంది. వాళ్ళందరికి సూరి లక్ష్మిలనుంచి తాయిలాలూ, పెన్సిలు ముక్కలు దొరుకుతాయి. ఏతావాతా ఎలిమెంటరీస్కూలు పిల్లలంతా సూరి అడుగుజాడల్లో పోతూ ఉంటారు.

మునుసబుగారి పాలేరు సుబ్బయ్య. సుబ్బయ్య రెండో కొడుకు చంద్రం. వాడూ, సూరి, లక్ష్మి - ఒకటే తరగతి. చంద్రాన్ని చూస్తే - సూరికి చులకన, లక్ష్మికి జాలి.

3504



ఇప్పుడు సూరికి, చంద్రానికి మాటా మాటా పెరిగింది. సిద్ధమంటే సిద్ధం అనుకున్నారు.

పిల్లలందరిని కేకేశాదు సూరి.

లక్ష్మి - "వద్దు బావా, వద్దు" అంది, లక్ష్మి - "వద్దు చంద్రం, వద్దు" అంది. చంద్రాన్ని కళ్ళతో అభ్యర్థించింది. సూరిని బుంగమూతితో బెదిరించింది. ఇద్దరూ వినలేదు. కాళ్ళు తాటిస్తూ వెళ్ళి తుమ్మచెట్టు కింద కూర్చుంది.

కళ్ళం నిండుకున్నారు పిల్లలు. చింతచెట్లు చిన్న బోయినై. పడమటి చెరువులో నీటికి నిలకడ చిక్కింది. తామర మడుగులో చేపపిల్లలు 'హమ్మయ్య' అనుకున్నై.

అందరికి మంచి వినోద ప్రదర్శన అది. యాభై తాటి ముంజల్ని అపకుండా తినాలి చంద్రం. చంద్రం గెలిస్తే ఐదు రూపాయలిస్తాడు సూరి. ఓడిపోతే సూరిని గుడిదాకా భుజాల మీద మొయ్యాలి చంద్రం. పందెం కాగానే ఆవకాయ బాగా తినేస్తే జబ్బు చెయ్యదనే ధైర్యం చంద్రానిది. ఎవరో చెప్తే విన్నాడు. 'ఈ చంద్రం గాడెటూ గెలవడు. కర్మకొద్దీ వాడే గెలిచినా, వెధవ అయిదు రూపాయలు పారేస్తే చాలు. మనం గెలిస్తే - వాడి భుజాలు హూనం కావటం ఖాయం' - ఇది సూరి ధైర్యం.

రామయ్యని పిలిచి తాటి చెట్టెక్కించాదు సూరి.

గెలలు తెగుతున్నై. కాయల తలలు తెగుతున్నై, కుడిచేతి బొటనవేలిని ముంజెలోనికి జూనిపి గోటితో అట్లాగే నోట్లోకి జుర్రుకుంటున్నాదు- చంద్రం. కాయ తర్వాత కాయ చంద్రం చేతికి అందుతోంది.

పిల్లలంతా చప్పట్లు కొడుతున్నారు. ఈలలేస్తున్నారు. లయ విన్యాసాలతో కేరింతలు కొడుతున్నారు. ఊళ్ళోకి పోయే బళ్ళ బాటమీద బళ్ళు ఆగుతున్నై. వివరం తెలుసుకొని సాగుతున్నై. కొన్ని కొన్ని ఈ చోద్యం చూద్దామని నిలబడుతున్నై.

ఆకాశంలో పిట్టలు బితుకు బితుకు మంటూ నిమ్మళంగా సాగుతున్నై.

ఒకటి.... రెండు.... మూడు..... ఏడు....ఎనిమిది.... తొమ్మిది........

జోరు తగ్గింది.

పదకొండు... పన్నెండు.... పదహారు.... పదిహేడు..... అంకె కదలడం కష్టంగా ఉంది. కనుగుడ్లు మిటకరిస్తున్నాడు చంద్రం. చేతుల్లో సత్తువా, అన్నమయ కోశంలో ఖాళీ తగ్గిపోతోంది. తేపులు వస్తున్నాయ్. బ్రే... ఒకటి... బ్రే...వ్....రెండు.

"తినరా నాయాలా... తింటానంటివిగా?" - ఎకసెక్కెం... ఎద్దేవా.... హేళనా.... హాసాలూ.... పరిహాసాలూ...!!

పదిహేడు....

కాయని వదిలేశాడు చంద్రం. కడుపులో ఎక్కడో తెలియని బాధ, ఏదో వికారం. కాళ్ళు తేలిపోతున్న భావన. కళ్ళు మూతలు పడుతున్నట్లు. ఏవిటో.... ఏమీ తెలియడం లేదు. భళ్ళున వాంతి చేసుకున్నాడు.

జనం మూగేరు. ఈ వార్తని ఊళ్ళోకి చేరేసింది లక్ష్మి. అందరికీ తెలిసి అట్టుడికినట్టుడికింది. గబగబా ఇంటికి చేర్చారు చంద్రాన్ని.

చంద్రానికి వాంతులూ, బేదులూ.

గంట గడిచింది. మనిషి డీలా పడిపోయేడు.

ఆకాశంలో సూర్యుడు మబ్బుల చాటున మొహం దాచుకుంటున్నాడు.

సుబ్బయ్య పెళ్ళాం పిల్లలూ- నెత్తి నోరు బాదుకుంటున్నారు. ఆచారిని పిలిపించారు. నాడీ, నాలుకా ఏ సూచననీ ఇవ్వలేదు. నా వల్ల కాదని జారుకున్నాడు. గూడుబండిలో పిల్లాడ్ని పట్నానికి తీసికెళ్ళారు.

నాలుగురోజుల తరువాత ఇంటికి తీసుకొచ్చారు చంద్రాన్ని. బతికి బట్టకట్టాడు.

ఆ రాత్రి - " ఆ పందెంలోకెందుకు దిగావురా అసలు?" అని లాలనగా , బాధగా అడిగాడు సుబ్బయ్య, కొడుకు తల నిమురుతూ.

ఊ అలతో చాలా సేపు గునిశాడు చంద్రం. చివరకు నెమ్మదిగా బెరుకు బెరుకుగా అన్నాడు- "ఆ ఐదు రూపాయలొస్తే రెండు పుస్తకాలొస్తయ్ కదా అనీ.... నిరుడు కూడా అన్నీ కొనలేక పోయాంగా. రోజూ ఆ లక్ష్మి ఇస్తుంటే తీసుకోవాలి...."

తండ్రి గుండె గతుక్కుమంది. పక్కనున్న భార్యకేసి చూశాదు, ఆమె వెంకన్న పటానికి దణ్ణం పెడుతోంది!

(ఆంధ్ర సచిత్రవారపత్రిక 3 అక్టోబర్ 1990)

